సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 5 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 19 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.1°/22.4°

జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

పారిశ్రామిక వెలుగులు

- జిల్లాలో మూడు పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు
- వర్చువల్‌గా భూమి పూజ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో శిలాఫలకాలను ఆవిష్కరించిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు



మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యే తిప్పేస్వామి తదితరులు

పుట్టపర్తి అర్బన్: నూతన జిల్లా శ్రీసత్యసాయిలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు యువతకు ఉపాధి కల్పించేందుకు జిల్లాలో కొత్తగా మూడు పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సుమారు రూ.380 కోట్లతో ఏర్పాటు చేయనున్న రెండు పరిశ్రమలతో పాటు మరో సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా భూమిపూజ చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో కలెక్టర్ అరుణ్‌బాబు మూడు పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు.

పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం..

పరిశ్రమలకు భూమి పూజ తర్వాత స్థానిక అధికారులు, రైతులతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందన్నారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించనుందన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉందన్నారు. రవాణా మార్గం, నీటి వసతి మెరుగు పడుతుండటం కూడా కలిసి వచ్చే అంశమన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎన్నో పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల సాగుతో అటు రైతులకు ఇటు ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా వివిధ రకాల చిరుధాన్యాలతో పిండి, బిస్కెట్, బేకింగ్ కుకీస్, మిల్లెట్ రేకులు, వెర్మిసెల్లీ, నూడుల్స్, ఫోర్టిఫైడ్ మిల్లెట్ తదితర వాటి తయారీకి అవకాశం కలుగుతుందన్నారు. మిల్లెట్ ప్రాసెసింగ్ పరిశ్రమతో రోజుకు 6 టన్నుల చొప్పున ఏడాదికి 2వేల పైబడి మెట్రిక్ టన్నుల ప్రాసెసింగ్ కెపాసిటీ ఉంటుందన్నారు. దీనివల్ల చిరుధాన్యాలు సాగుచేసే రైతులకు ఇకపై మార్కెటింగ్ సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, కదిరి ఎంపీపీ అమర్నాథ్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, వివిధ కంపెనీల అధికారులు జైపాల్ రావు, గురుప్రసాద్, మధుశా, కార్తీక కృష్ణ, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, జెడ్ఎం సోని తదితరులు పాల్గొన్నారు.

ఏ పరిశ్రమలు ఎక్కడంటే...

- కదిరి మండలం పట్నం సమీపంలో అర ఎకరా విస్తీర్ణంలో రూ.4.41 కోట్ల వ్యయంతో సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పనున్నారు. ఇందులో 20 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుండగా, 2 వేల మందికిపైగా పరోక్షంగా ఉపాధి లభించనుంది.
- సోమందేపల్లి మండలం గుడిపల్లి ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్‌లో యునైటెడ్ ఇండస్ట్రీస్ ఆటోమోటివ్ ప్లాస్టిక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆటో ఇండస్ట్రీకి ఉపయోగపడే ప్లాస్టిక్ ఇంజక్షన్ మౌల్డ్ కంపోనెంట్స్ తయారీ పరిశ్రమను నెలకొల్పనున్నారు. రూ.125 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమ ద్వారా సుమారు 750 మందికి ఉపాధి లభించనుంది. ఈ కంపెనీ కోసం ఇప్పటికే ఏపీఐఐసీ 8.05 ఎకరాల భూమిని సేకరించింది. ఆరు నెలల్లోపు అన్ని హంగులతో పరిశ్రమ ఏర్పాటు కానుంది.
- మడకశిర మండలం ఆర్.అనంతపురంలో ఎవరెస్ట్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రీ ఫ్యాబ్రికేటెడ్ స్టీల్ స్ట్రక్చర్స్ ఏర్పాటు చేయనున్నారు. 48.43 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమ రూ.250 కోట్లతో రూపుదిద్దుకోనుంది. ఇందులో 600 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏడాది తరువాత ఉత్పత్తి ప్రారంభించనున్నారు.

మా గ్రామానికి మంచి రోజులు



మా గ్రామంలో రూ.4.41 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉంది. ఈ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా మాలాంటి చిరుధాన్యాలు పండించే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. అలాగే మా ఊరి యువతకూ ఉపాధి దక్కుతుంది. ఇది పూర్తయితే మా గ్రామానికి మంచి రోజులు వచ్చినట్లే.

– గంగిరెడ్డి, రైతు, పట్నం

నిజంగా మా అదృష్టం



చిరుధాన్యాల సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పడం కదిరి నియోజకవర్గం రైతులు చేసుకున్న అదృష్టం. పరిశ్రమ నెలకొల్పడంతో యువతకు ఉపాధి అవకాశాలతో పాటు చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉంటుంది. దీన్ని నమ్ముకొని జిల్లాలో వేలాది మంది రైతులు ఉన్నాం. త్వరలోనే పరిశ్రమను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– హనుమంతరెడ్డి, రైతు, వీరేపల్లిపేట, కదిరి మండలం

చిరుధాన్యాలే పండిస్తాం



నాకున్న ఐదెకరాల్లో ఇప్పటి వరకూ వేరుశనగ, వరి సాగు చేశాను. ఇకపై పంటమార్పిడిలో భాగంగా చిరుధాన్యాలు సాగు చేస్తా. చిరుధాన్యాల సాగుపై ఇప్పటికే అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు పరిశ్రమ అందుబాటులోకి రావడం శుభ పరిణామం. పరిశ్రమ పూర్తయితే గిట్టు బాటు ధరలు లభిస్తాయి.

– బూక్యా ఆనంద్ నాయక్, రైతు, రాచువారిపల్లి తండా

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాలు-1, 3, 7 (ఆర్థిక/ప్రణాళిక, వ్యవసాయం/ఇంజినీరింగ్) సమావేశాలు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్నాయి. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జరిగే సమావేశాలకు ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్, ఆయా స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు హాజరు కానున్నారు. గత సమావేశాల్లో చర్చించిన అంశాలకు సంబంధించి సమగ్ర వివరాలతో హాజరు కావాలని సంబంధిత అధికారులను ఇప్పటికే ఆదేశించారు.

అంచనాల కమిటీ సభ్యుడిగా డాక్టర్ తిప్పేస్వామి



మడకశిర: శాసనసభ అంచనాల కమిటీలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి చోటు దక్కింది. ఎమ్మెల్యే కళావతి చైర్‌పర్సన్‌గా ఉన్న ఈ కమిటీలో తిప్పేస్వామితో పాటు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి కూడా అవకాశం కల్పించారు. ఇప్పటికే ఎమ్మెల్యే తిప్పేస్వామి అసెంబ్లీలో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను అంచనాల కమిటీ సభ్యుడిగా నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు, స్పీకర్ తమ్మినేని సీతారాంకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఏపీఆర్‌జేసీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

పరిగి: మండలంలోని ఏపీఆర్ జూనియర్ కళాశాల కొడిగెనహళ్లి విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడల్లో సత్తా చాటారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, త్రోబాల్, యోగా పోటీలతో పాటూ అథ్లెటిక్స్‌లోనూ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఏపీ ఆర్‌జేసీ కొడిగెనహళ్లి విద్యార్థులు 21 మంది జిల్లా తరఫున పాల్గొంటారని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేరస్తులు శిక్ష నుంచి తప్పించుకోలేరు



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: నేరం చేసిన వారు శిక్ష నుండి తప్పించుకోకుండా పక్కా ఆధారాలతో కోర్టు ముందుకు ప్రవేశ పెడుతున్నామని, అందువల్లే ఇటీవల చాలా మందికి శిక్షలు పడ్డాయని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. పోక్సో కేసులో గాండ్లపెంట మండలం ఎర్రదేనుపల్లి గ్రామానికి చెందిన గంగరాజుకు కోర్టు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించిన నేపథ్యంలో ఎస్పీ మాధవరెడ్డి బుధవారం ఈ కేసును దర్యాప్తు చేసిన పోలీసులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమైన కేసుల్లో నిందితులకు శిక్ష పడితేనే బాధితులకు సరైన న్యాయం చేసినట్లు భావించాలన్నారు. ప్రయారిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ సంవత్సరం 502 కేసులను ప్రయారిటీగా తీసుకున్నామని, వీటిలో 433 కేసులు వివిధ దశల్లో కోర్టులో ఉన్నాయన్నారు. జిల్లాలో నమోదైన 15 కేసుల్లోని నిందితులకు కోర్టులు ఇప్పటికే శిక్ష ఖరారు చేస్తూ తీర్పులిచ్చాయన్నారు. ఎస్ఐ స్థాయి నుంచి డీఎస్పీ స్థాయి వరకూ కొన్ని కేసులు స్వీకరించి కోర్టులో సరైన సాక్షులు, సాక్ష్యాలు ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడేలా పోలీస్ వ్యవస్థ పనిచేస్తోందన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి

- పోలీసులకు డీఐజీ అమ్మిరెడ్డి సూచన



మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

ముదిగుబ్బ: వివిధ సమస్యలతో పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. బుధవారం రాత్రి ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసు వివరాలను పరిశీలించారు. వివిధ దర్యాప్తు కేసుల తీరును సీఐ యతీంద్రను అడిగి తెలుసుకున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాదాలను నివారించాలన్నారు.

ఈవీఎంలను తనిఖీ చేసిన కలెక్టర్

- బార్‌కోడ్ ప్రకారం స్కానింగ్ చేయాలని సిబ్బందికి సూచన

ధర్మవరం అర్బన్: ఓటింగ్‌కు వినియోగించే ఈవీఎం మిషన్‌లోని వీవీ పాట్స్, బ్యాలెట్ యూనిట్లు స్కానింగ్ పక్కాగా ఉండాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. బుధవారం రాత్రి ఆయన పట్టణంలోని మార్కెట్‌యార్డులో నిల్వ చేసిన ఈవీఎంలను తనిఖీ చేశారు. ఇక్కడ 4,800 వీవీ పాట్స్, 4,000 బ్యాలెట్ యూనిట్ల భద్రపరిచినట్లు కలెక్టర్ తెలిపారు. స్కానింగ్ ప్రక్రియ గురువారంతో పూర్తవుతుందన్నారు. ఈనెల 6వ తేదీన బెంగళూరు నుంచి ఇంజినీర్లు వచ్చి వాటిని పరిశీలించి ధ్రువీకరిస్తారన్నారు. అంతవరకూ ఈవీఎంల భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ తిప్పేనాయక్, తహసీల్దార్ యుగేశ్వరిదేవి, డిప్యూటీ తహసీల్దార్ మెయిన్ ఉద్దిన్‌బాషా, ఎన్నికల తహసీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష



అమగొండపాళ్యంలో వైద్య సేవల అనంతరం కేస్‌షీట్ చూపుతున్న దృశ్యం



సురక్ష శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న జనం

- రూ.1.20 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- మూడు రోజుల్లో 27,518 మందికి వైద్య సేవలు
- 3,323 మందికి కంటి అద్దాల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' హెల్త్ క్యాంపులు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. ప్రజల ముంగిటకే వైద్యం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.1.20 కోట్లు నిధులు మంజూరు చేసింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య శిబిరాలను 45 రోజుల పాటు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

మందులు, అద్దాల పంపిణీ..

సురక్ష శిబిరాలకు వచ్చే రోగులను వైద్యులు పరీక్షించడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నారు. అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నారు. అలాగే వైద్య శిబిరాలకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించడానికి గ్రామ సచివాలయాలకు రూ.30 వేలు, పట్టణాలకు రూ.40 వేలు చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ నిధులను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల ఖాతాల్లో జమ చేసింది. ఈ నిధులను వైద్య శిబిరాలకు వచ్చే రోగులు కూర్చునేందుకు కుర్చీలు, షామియానాలు, వైద్య సిబ్బందికి భోజనాలు, తాగునీరు, టేబుళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, టీ, స్నాక్స్, బ్యానర్లు, మైక్ సెట్, రవాణా వంటి వాటికి ఖర్చు చేయనున్నారు.

మూడు రోజుల్లో 27,518 మందికి వైద్య సేవలు

గత నెల 30వ తేదీ, అక్టోబర్ 3, 4 తేదీలు కలిపి మూడు రోజుల్లో జిల్లాలోని 74 సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఇందులో 27,518 మందికి ఉచిత వైద్య సేవలు అందించగా, 3,323 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు.

మందులు, కంటి అద్దాలు ఇచ్చారు



నాకు చాలా కాలంగా కళ్లు కనిపించడం లేదు. మా గ్రామానికి మండలం కేంద్రం 14 కి.మీ దూరంలో ఉంది. దీంతో అక్కడికి వెళ్లడానికి ఇబ్బంది పడేదాన్ని. ఇటీవల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య నిర్వహించారు. అక్కడికి వెళ్లగా కళ్లు పరీక్షించి మందులు ఇచ్చారు. దీంతో పాటే కంటి అద్దాలు అందజేశారు. ఇప్పుడు నా పనులు నేనే చేసుకోగలుగుతున్నా.

– వెంకటనరసమ్మ, జగరాజుపల్లి

రబీ సాగుకు రైతులను సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. సంపత్‌కుమార్

కదిరి అర్బన్: ఖరీఫ్ సీజన్ ముగిసిన నేపథ్యంలో రబీ సాగుకు రైతులను సమాయత్తం చేయాలని స్థానిక వ్యవసాయ పరిశోధనాస్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. సంపత్‌కుమార్ జిల్లాలోని అగ్రికల్చర్ ఏడీఏలకు సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో జిల్లాస్థాయి వ్యవసాయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏరువాక కో ఆర్డినేటర్ రామసుబ్బయ్య, కేవీకే రెడ్డిపల్లి కో ఆర్డినేటర్ డా.మల్లీశ్వరీతో పాటు పలువురు శాస్త్రవేత్తలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ..... జిల్లా ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2.82 లక్షల హెక్టార్లు కాగా, ఈ ఖరీఫ్‌లో 1.09 లక్షల హెక్టార్లలో మాత్రమే వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయన్నారు. అందులోనూ ప్రధాన పంట వేరుశనగ 1.7 లక్షల హెక్టార్లకు గాను కేవలం 50 వేల హెక్టార్లలో మాత్రమే సాగులోకి వచ్చిందన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో నమోదైన అత్యల్ప వర్షపాతం ఇందుకు కారణమన్నారు. ప్రస్తుతం రబీ సీజన్ ఆరంభమైందని, అక్టోబర్, నవంబర్ నెలల్లో కురిసే వర్షాలతో రబీలో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. అనంతరం రబీలో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటతో పాటు ఇతర పంటల్లో తెగుళ్ల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. సమావేశంలో శాస్త్రవేత్తలు వేమన, నీలిమ, చంద్రాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

98.3 శాతం పింఛన్ల పంపిణీ



అనంతపురంలో విశ్రాంతి తీసుకుంటున్న వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న తాడిమర్రి-1 సచివాలయ వలంటీర్ మహేష్

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో జిల్లాలో 98.3 శాతం పింఛన్ పంపిణీ పూర్తికాగా, జిల్లా రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచింది. పింఛన్ పంపిణీ గురువారంతో ముగియనుంది. నాలుగు రోజుల్లో వలంటీర్లు 2,69,293 మందికి రూ.74,82,27,250 నగదు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. చివరి రెండు రోజులూ సుదూర ప్రాంతాల్లో ఉన్న వారికి, జబ్బులతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకే వెళ్లి పింఛన్ అందజేసినట్లు ఆయన వెల్లడించారు.



సుబ్బరాయనిపల్లి రైతులు సాగు చేసిన కంది



గోరంట్ల మండలం గంగంపల్లి వద్ద వేరుశనగ పంట ఇలా..



పెదపల్లి వద్ద సాగులో ఉన్న వరి పంట

ఖరీఫ్ పంట..కళకళ

పుట్టపర్తి అర్బన్: భూమికి పచ్చాని రంగేసినట్టు ఎక్కడ చూసినా ఖరీఫ్ పంటలు కళకళ లాడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లా అంతటా పచ్చదనం పరుచుకుంది. ఖరీఫ్ ముందస్తు పంటల సాగు ఇప్పటికే పూర్తి కాగా, ఆలస్యంగా సాగుచేసిన పంటల్లో 65 వేల హెక్టార్లలో వేరుశనగ, 4,300 హెక్టార్లలో వరి, 6,540 హెక్టార్లలో మొక్కజొన్న, 8,760 హెక్టార్లలో కంది, 7 వేల హెక్టార్లలో ఉలవ కలిసి మొత్తంగా 91,600 హెక్టార్లు సాగులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు తెలిపారు. ఈ పంటలన్నీ ఇటీవలి వర్షాలతో కళకళలాడుతుండగా, దిగుబడులపై ఆశలు రేకెత్తుతున్నాయి. వర్షాలతో బోరుబావులు, కుంటలు, వంకలు, పలు చెరువులు జలకళ సంతరించుకోవడంతో రబీ పంటలకు సైతం నీటి ఇబ్బందులు ఉండవని రైతులు భావిస్తున్నారు. ఈ నెలలో కూడా మంచి వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్న నేపథ్యంలో పంటల సాగుకు ఎలాంటి ఇబ్బంది ఉండదనుకుంటున్నారు.



పచ్చదనం సంతరించుకున్న జొన్న పంట

క్లుప్తంగా

బాగున్నావా నేస్తమా..



నంది విగ్రహం వద్ద పూర్వ విద్యార్థులు

లేపాక్షి: చిలమత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1972–73లో చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం స్థానిక అన్నదాన సత్రంలో సమావేశం (గెట్ టు గెదర్) నిర్వహించారు. విద్యాభ్యాసం నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని మురిసిపోయారు. కలసి కట్టుగా వీరభద్రస్వామి దేవాలయం సందర్శించారు. నంది విగ్రహం వద్ద ఫొటో తీసుకున్నారు. అనంతరం సత్రంలో భోజనం చేసుకుని ఆరగించారు. మళ్లీ వీలు చూసుకుని కలుద్దామంటూ వెనుదిరిగారు.

12న రైల్వే సహకార సొసైటీ ఎన్నికలు



ప్రచారం చేస్తున్న ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

గుంతకల్లు/గుత్తి: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్‌లోని రైల్వే ఉద్యోగుల సహకార సొసైటీ ఎన్నికలు ఈ నెల 12న గుంతకల్లులో జరగనున్నాయి. 17న జోనల్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. మొత్తం 28 డెలిగేట్ సభ్యులు ఎన్నిక కానుండగా, అనంతరం వారు ఇద్దరు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఎన్నికల్లో సంఘ్, యూనియన్ తరఫున 28 మంది చొప్పున పోటీ పడుతున్నారు. దీంతో రెండు సంఘాల నాయకులు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. గుంతకల్లు రైల్వే డీఆర్‌ఎం కార్యాలయం, రైల్వేస్టేషన్, రైల్వే కాలనీల్లో ఎన్నికల్లో పోటీ చేసే డెలిగేట్ల ఫొటోలతో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రైల్వే ఉద్యోగుల సహకార సొసైటీ ప్రధాన కార్యాలయం హైదరాబాద్ కాగా, శాఖాపర కార్యాలయం గుంతకల్లులో ఉంది.

శిల్పకళ.. భళా







విగ్రహాలు తయారు చేస్తున్న దృశ్యం, సురేశ్ ఆచార్ కుమారుడు దేవరాజు చెక్కిన వన్నేశ్వర స్వామి విగ్రహం, తయారు చేసిన విగ్రహాలతో ఆచార్

- విగ్రహాలకు జీవం పోస్తున్న సురేశ్ ఆచార్ కుటుంబం
- 40 ఏళ్లుగా ఇదే వృత్తి
- కర్ణాటక నుంచి కూడా తయారీకి ఆర్డర్లు

అగళి: మండల కేంద్రమైన అగళిలో సురేశ్ ఆచార్ 40 సంవత్సరాల నుంచి దేవతా విగ్రహాలను చెక్కుతూ అందరికీ సుపరిచితుడయ్యారు. అతని కుమారులు దేవరాజ్ ఆచార్, విశ్వనాథ ఆచార్ కూడా శిల్పాలు చెక్కుతూ వస్తున్నారు. మొత్తం కుటుంబ సభ్యులందరూ ఇదే వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

ఎంతో పేరు...

సురేష్ ఆచార్ రూపొందించే విగ్రహాలు ప్రజల మన్ననలు పొందుతున్నాయి. వీరు తయారు చేసే ఎలాంటి విగ్రహాలైనా ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. తమ కళతో విగ్రహాలకు జీవం పోస్తున్న ఈ కుటుంబం పేరు కేవలం మండలవ్యాప్తంగానే కాకుండా పక్క రాష్ట్రాలకు కూడా పాకింది. దీంతో కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా విగ్రహాల తయారీకి ఆర్డర్లు వస్తున్నాయి. ఈ కుటుంబ సేవలను గుర్తించిన కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు యూనివర్సిటీ అందులో ఒకరైన దేవరాజ్ ఆచార్‌కు డాక్టరేట్ కూడా ప్రదానం చేయడం గమనార్హం.

తరతరాలుగా ఇదే వృత్తిలో..

సురేశ్ ఆచార్ పూర్వీకులది కూడా విగ్రహాల తయారీ వృత్తే. అలా వంశ పారంపర్యంగా వచ్చిన శిల్పకళను సురేష్ ఆచార్ అలవరచుకున్నారు. తన కుమారులకూ నేర్పాడు. సాధారణంగా తరాలు మారిన తర్వాత కుల వృత్తులకు ఆదరణ తగ్గి దాన్ని నమ్ముకున్న వారు వేరే రంగాల వైపు మళ్లుతున్న రోజులివి. ఇలాంటి కాలంలోనూ పురాతన కాలం నుంచి వచ్చిన శిల్పాలు చెక్కే కళను కొనసాగించడం విశేషమే అని చెప్పవచ్చు.

రోజుకో విగ్రహం తయారీ

రోజూ ఏదో ఒక విగ్రహాన్ని తయారు చేస్తా. నా కుమారులు కూడా సహాయ పడుతున్నారు. ఈ వృత్తితోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నా. గ్రామాల్లో ఎంతో ఆదరిస్తున్నారు. నా 35 ఏళ్ల అనుభవంలో ఎన్నో విగ్రహాలు చెక్కా. అయ్యప్పస్వామి, వినాయకుడు, వెంకటేశ్వరస్వామి విగ్రహాలతో పాటు అనేక గ్రామదేవతల విగ్రహాలను రూపొందించా.

– సురేశ్ ఆచార్, కళాకారుడు

స్తంభించిన తపాలా సేవలు



అనంతపురం హెడ్ పోస్టాఫీసు ఎదుట బైఠాయించిన తపాలా ఉద్యోగులు

అనంతపురం సిటీ: గ్రామీణ తపాలా ఉద్యోగుల ఒక రోజు సమ్మెతో బుధవారం జిల్లాలో సేవలు స్తంభించిపోయాయి. బ్యాగులు తీసుకురావడం, తీసుకుపోవడం నిలిపివేయడంతో సబ్ పోస్టాఫీసుల్లో పేరుకుపోయాయి. బ్రాంచ్ పోస్టాఫీసుల తలుపులు కూడా తెరవలేదు. సబ్ పోస్టాఫీసుల ఎదుట షామియానాలు వేసి ఉద్యోగులు నిరసన తెలిపారు. జిల్లాలో 405 బ్రాంచ్ పోస్టాఫీసుల ఉద్యోగులు 57 సబ్ పోస్టాఫీసుల ఎదుట సమ్మెకు దిగారు. హిందూపురం పోస్టల్ డివిజన్‌లోని 421 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో పని చేసే సిబ్బంది 68 సబ్ పోస్టాఫీసుల ఎదుట ఆందోళన చేశారు.

సమ్మె సక్సెస్..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తాము తలపెట్టిన సమ్మె విజయవంతమైనట్లు ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ సర్కిల్ కార్య నిర్వాహక కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ తెలిపారు. అనంతపురం హెడ్ పోస్టాఫీసు ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు తమ 11 ప్రధాన డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ పిలుపు మేరకు బుధవార ఉమ్మడి జిల్లాలోని 826 బ్రాంచ్ పోస్టాఫీసులు మూత పడ్డాయన్నారు. సుమారు 1,600 మంది ఉద్యోగులు విధులు బహిష్కరించారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఇప్పటి వరకు శాంతియుతంగా ఆందోళనలు, నిరసనలు కొనసాగించామన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఇకపై పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

డెంగీతో విద్యార్థి మృతి



మృతుడు హేమంత్

గోరంట్ల: డెంగీ జ్వరంతో విద్యార్థి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శిరగంవాండ్లపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన వడ్డే ముద్దురంగప్ప, రాధమ్మ దంపతుల కుమారుడు హేమంత్ 10వ తరగతి చదువుతున్నాడు. గత 5 రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. మూడు రోజుల క్రితం కుటుంబసభ్యులు హిందూపురం ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. జ్వరం తగ్గకపోవడంతో బుధవారం ఉదయం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కర్నూలులో డెంగీ మరణంగా నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన దుర్గేష్

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో బోయ దుర్గేష్ (21) అనే యువకుడు బుధవారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బొమ్మనహాళ్ పోలీసులు తెలిపిన మేరకు.. దుర్గేష్‌కు కణేకల్లు మండలం బెణికల్లు గ్రామానికి చెందిన మణి అనే యువతితో రెండేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా ఇద్దరి మధ్య కలహాలు ఏర్పడ్డాయి. మంగళవారం భార్య మణి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బోయ దుర్గేష్ చీరతో రేకులషెడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతాలో నగదు మాయం

గార్లదిన్నె: ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైన సంఘటన మండల పరిధిలోని కల్లూరులో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన సుధాకర్‌కు కల్లూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పాటు అనంతపురం కెనరా బ్యాంకులో ఖాతా ఉంది. రెండు రోజుల క్రితం స్టేట్ బ్యాంకు ఖాతాలోని రూ. 1,600, కెనరా బ్యాంకు ఖాతాలోని రూ.4,400 డ్రా చేసినట్లు మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. సుధాకర్ బ్యాంకులకు వెళ్లి విచారణ చేస్తే డ్రా చేసినట్లు సిబ్బంది తెలిపారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు.

బియ్యంతో మోసం చేశారని కపటనాటకం

అనంతపురం క్రైం: బియ్యంతో తమను మోసం చేసిన వారి ఆట కట్టించాలని భావించిన ఓ జంట కపటనాటకానికి తెరతీసింది. అనంతపురం నాల్గవ పట్టణ పోలీసులను పరుగులు పెట్టించింది. పోలీసులు కుటిల ప్రశ్నలు వేయడంతో చివరికి నీళ్లు నమిలి తమ నాటకాన్ని బయటపెట్టారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం మంగళవారి కాలనీలో నివాసం ఉంటున్న టైలర్ పుష్పలత, బార్బర్ నాగభూషణం దంపతులు. బుధవారం తెలిసిన వారితో సోనామసూరి బియ్యం కొనుగోలు చేశారు. వారు వెళ్లిపోయిన తర్వాత బియ్యం పరీక్షిస్తే సోనామసూరి కాదని స్టోర్ బియ్యాన్ని పాలిష్ పట్టి విక్రయించారని గుర్తించారు. బియ్యం అమ్మిన వారికి ఫోన్ చేస్తే స్పందించలేదు. దీంతో బియ్యం వ్యాపారులపై ఎలాగైనా కేసు పెట్టాలని పుష్పలత ప్లాన్ వేసింది. తన భర్తను పిలిచి చైన్ స్నాచింగ్ జరిగినట్లు పోలీసులకు ఫోన్ చేస్తే పని సులువవుతుందని స్కెచ్ వేసింది. అనుకున్నదే తడవుగా పోలీసులకు ఫోన్ చేసింది. బియ్యం వ్యాపారులుగా ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తన భార్య మెడలోని బంగారు గొలుసును అపహరించుకుపోయారని నాగభూషణం వారికి తెలిపాడు. నాల్గవ టౌన్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. దంపతుల మాటల్లో తేడా రావడంతో అనుమానం వచ్చి ఆరా తీయడం మొదలుపెట్టారు. బంగారు గొలుసు ఎవరు లాక్కెళ్లారు, ఎలా వెళ్లారు అంటూ ప్రశ్నలు కురిపించడంతో నీళ్లు నమిలిన దంపతులు ఎట్టకేలకు నిజం ఒప్పుకున్నారు. భార్య చెప్పమనడంతో చెప్పాల్సి వచ్చిందని నాగభూషణం అసలు విషయం బయట పెట్టాడు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. జంటను మందలించిన పోలీసులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

ఐటీఐల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు

లేపాక్షి: శ్రీ సత్యసాయి జిల్లాలోని 14 ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 5వ విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ రాయప్ప రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 7 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేసుకుంటేనే కౌన్సెలింగ్‌కు అర్హులవుతారని తెలిపారు. ఈనెల 9వ తేదీ ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులు www.itiap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జీవాల మందపై దూసుకెళ్లిన లారీ



ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు, మేకలు



ప్రమాద ఘటనపై ఆరా తీస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్: లారీ దూసుకెళ్లడంతో 11 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. మండలంలోని కదరంపల్లి గ్రామం టోల్ గేట్ వద్ద బుధవారం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బొమ్మనహాళ్ మండలం గోనెహాళ్ గ్రామానికి చెందిన తిప్పేస్వామి, సోమిరెడ్డి, పర్వతయ్య, గంగమూర్తిలు గొర్రెల కాపరులు. మేత కోసం బుధవారం గుండ్ల పల్లి క్రాస్ మీదుగా ప్రధాన రహదారి గుండా రాయదుర్గం వైపు గొర్రెలు, మేకలు తోలుకుని వస్తున్నారు. ఆ సమయంలో అనంతపురం వైపు నుంచి ఇసుకతో కర్ణాటక వైపు వెళుతున్న 16 చక్రాల లారీ మందపై దూసుకెంది. ఘటనలో 5 గొర్రెలు, 6 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. 12 జీవాలు తీవ్రంగా గాయపడ్డాయి. వెటర్నరీ వైద్యులు డాక్టర్ శిరీష, డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని గాయపడిన జీవాలకు చికిత్సలు అందించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి బాధిత కాపరులను పరామర్శించారు. లారీకి ఇన్సురెన్స్ ఉంటే గొర్రెల కాపరులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఘటనపై గొర్రెల యజమాని సోమేశ్వర్ రెడ్డి ఫిర్యాదు మేరకు డ్రైవర్ వెంకటేశ్వర్ రెడ్డిపై కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నూర్ మహమ్మద్ తెలిపారు.

గుప్త నిధుల తవ్వకాల కలకలం



పేలుబండ కొండ సమీపంలో తవ్విన గుంత



పోలీసులు స్వాధీనం చేసుకున్న జేసీబీ

అమరాపురం: మండలంలోని పేలుబండ గ్రామ సమీపంలోని లక్ష్మీ రంగనాథస్వామి కొండ వద్ద మళ్లీ గుప్త నిధుల తవ్వకాల కలకలం రేగింది. కొండ కింద భాగాన ఉన్న మరువ సమీపంలో మంగళవారం రాత్రి జేసీబీ సాయంతో తవ్వకాలు జరుపుతుండడగా గ్రామస్తులు గుర్తించారు.జేసీబీని ఆపి, పోలీసులకు సమాచారం అందించారు. గతంలో కూడా ఇక్కడ తవ్వకాలు జరిపారని గ్రామస్తులు తెలిపారు. పోలీసు అధికారులు భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కాంతరాజు, మంజునాథ్, ఆలదపల్లి మూర్తి తదితరులపై కేసు నమోదు చేసినట్లు గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు.

ఇక డిజిటల్ కార్డులే..



హిందూపురం ఆర్టీఓ కార్యాలయం

హిందూపురం: రవాణాశాఖ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. పేపర్ రహిత కార్డుల దిశగా అడుగులు వేస్తోంది. డ్రైవింగ్ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను ప్రింట్ చేసే పాత విధానానికి స్వస్తి పలికింది. ఇక నుంచి డ్రైవింగ్ లైసెన్స్‌ను కార్డు రూపంలో వాహనదారులు తీసుకెళ్లాల్సిన పని లేకుండా డిజిటల్ విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఏ రోజుకారోజు డిజిటల్ లైసెన్స్‌లు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో పాటు ఎం. పరివాహన్, డిజీ లాకర్‌లో లభ్యమయ్యేలా చూస్తున్నారు. ఫోన్లలో డిజి లాకర్‌లో ఉంచుకొన్న లైసెన్స్‌లు పోలీస్, రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేసినప్పుడు చూపితే సరిపోతుంది. ఫోన్లు వాడని వారు ప్రింట్ తీసుకొని ఉంచుకోవచ్చు. డీఎల్, ఆర్‌సీల కోసం పోస్టల్ చార్జీతో కలిసి రూ.235 వరకూ గతంలో వసూలు చేసే వారు. డిజిటల్ పత్రాల జారీతో అలాంటి బాధలన్నీ తప్పినట్లయింది.

ఆధార్‌కార్డుతో కార్డు పట్టుకెళ్లొచ్చు..

గతంలో ఉన్న పద్ధతి ప్రకారం ముద్రించిన 32 వేల కార్డుల్లో ఇప్పటి వరకు 9,140 కార్డులను పోస్టల్ ద్వారా వాహనదారులకు పంపారు. వాటిలో 10 శాతానికి పైగా చిరునామాలు మారడంతో వెనుదిరుగుతున్నాయి. కార్డులు కావాల్సిన వారు ఆధార్ కార్డుతో రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లి డీఎల్, ఆర్సీ కార్డులు పొందే వీలు కల్పించారు.

వాహనదారులకు సౌలభ్యం..



డిజిటల్ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలతో వాహన దారులకు సౌలభ్యంగా ఉంటోంది. వీటి జారీకి కొత్తగా ఎలాంటి రుసుం వసూలు చేయడం లేదు. ఎం.పరివాహన్ యాప్‌లో అందుబాటులో ఉంచుతున్నాం.

– కరుణసాగర్‌రెడ్డి, రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్, హిందూపురం

కరువునేలలోనూ సిరుల పంట ఆముదం



వేపకుంటలో ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

- తీవ్ర వర్షాభావంలోనూ దిగుబడులు సాధ్యం
- వేరుశనగతో పాటు అంతర్ పంటగా సాగు చేసుకుంటే మేలు
- భారత నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు

కనగానపల్లి/ఆత్మకూరు: వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనే ప్రాంతాల్లోనూ రైతులకు ఆముదం పంట సిరులు కురుపిస్తోందని భారత నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు తెలిపారు. భారత నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ మాథూర్, ఆముదం పంట ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ లావణ్య, డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ జవహర్‌లాల్ జాటోత్, డాక్టర్ మంజునాథ్, రేకుల కుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, శాస్త్రవేత్తలు రాధిక, పవన్‌కుమార్‌రెడ్డి, పద్మలత, ఆత్మా పీడీ మద్దిలేటి తదితరులు బుధవారం ఆత్మకూరు మండలంలోని సనప, కనగానపల్లి మండలంలోని వేపకుంట గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఆముదం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రోన్ ద్వారా ఏ విధంగా ఆముదం పంటకు స్ప్రే చేయాలన్న విషయాలను రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు ఇటీవల ఆముదం సాగుపై దృష్టి సారించారని, అందువల్లే గతంతో పోలిస్తే ఈ ఏడాది ఆముదం సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. అంతర్ పంటగా ఆముదం వేస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు.

ఐసీహెచ్–5 రకంతో అధిక దిగుబడి..

ఐసీఏఆర్ ఆధ్వర్యంలో నడిచే భారత నూనె గింజల పరిశోధన సంస్థ తయారు చేసిన ఐసీహెచ్–5 రకం ఆముదం విత్తనంతో అధిక లాభాలు సాధ్యమవుతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ వంగడం నెల రోజుల పాటు వర్షం లేకున్నా దిగుబడి ఇవ్వగలదన్నారు. అంతేకాకుండా మెట్ట పొలాల్లో ఈరకం వంగడం బాగా దిగుబడి ఇస్తుందన్నారు. గుజరాత్‌లో ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని, మన నేలల్లో ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని పరిశోధకులు తెలియజేశారు. ఐసీహెచ్–5 వంగడం ఆముదం 95 నుంచి 110 రోజుల్లో కోతకు వస్తుందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ.5 వేలకుపైగా పలుకుతోందని తెలిపారు. అనంతరం రైతులతో కలసి ఆముదం పంటలో యాంత్రీకరణ యాజమాన్యం పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ ఆలుమూరు సుబ్బారెడ్డి, ఏడీఏ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి సుచరిత, ఎంపీఈఓ నాగమణి, ఆషు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలతో విజిలెన్స్ అధికారులు

గుత్తి రూరల్: మండలంలోని పెద్దొడ్డి గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 61.50 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని బుధవారం అనంతపురం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పెద్దొడ్డికి చెందిన తపిల చిరంజీవి మండలంలోని పలు గ్రామాల్లో కార్డుదారులు తెచ్చుకున్న బియ్యం కొనుగోలు చేసి తన ఇంట్లో నిల్వ ఉంచుకున్నాడు. పక్కా సమాచారంతో బుధవారం ఉదయం 6.30 సమయంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. చిరంజీవి ఇంట్లో తనిఖీలు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 117 బస్తాల్లోని 61.50 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. గుత్తి సీఎస్‌డీటీ సూర్యనారాయణకు అప్పగించారు. చిరంజీవిపై రెవెన్యూ చట్టం 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ తెలిపారు. విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్, ఏఈ కుల్లాయిరెడ్డి పాల్గొన్నారు.

గుంతకల్లులో 20 క్వింటాళ్లు..

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శ్రీలంక కాలనీలో ఓ ఆటోలో ఉంచిన 20.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని జిల్లా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం విజిలెన్స్ అధికారులు వాసుప్రకాష్, ఫణీంద్రరెడ్డి స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. పీడీఎస్ బియ్యం, ఆటోను సీజ్ చేసి సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మికి స్వాధీనం చేసినట్లు అధికారులు వెల్లడించారు. బియ్యాన్ని తరలిస్తున్న వీరేష్‌బాబు, హనుమంతు, మహేష్‌పై రూరల్ పీఎస్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయించినట్లు విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు.

బిహార్, తమిళనాడు విజయం



బిహార్, ఉత్తరాఖండ్ మధ్య మ్యాచ్

అనంతపురం: స్థానిక ఆర్డీటీ క్రీడా గ్రామంలో సబ్ జూనియర్ బాయ్స్ నేషనల్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. బుధవారం బిహార్–ఉత్తరాఖండ్ రాష్ట్రాల మధ్య జరిగిన మ్యాచ్‌లో బిహార్ 7 గోల్స్ సాధించి, ఉత్తరాఖండ్‌పై ఘన విజయం సాధించింది. ఉత్తరాఖండ్ కేవలం ఒక గోల్ మాత్రమే చేసింది. తమిళనాడు–తెలంగాణ రాష్ట్రాల మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు 7 గోల్స్ సాధించి విజయం కైవసం చేసుకుంది. తెలంగాణ ఒక గోల్ కూడా చేయలేదు. అస్సాం – సిక్కిం రాష్ట్రాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అస్సాం 5–1తో జయకేతనం ఎగురవేసింది.